

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



(భీమవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 5-11-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ధనం పాడుచేసుకొంటే మరల కొంత సంపాదించుకోవచ్చు. ఆరోగ్యం చెడిపోయింది అనుకోండి కొంతకాలానికి ఆరోగ్యం సంపాదించుకోవచ్చు. కాని కాలం పోతే మరల మనం సంపాదించుకోలేము. అంటే జరిగిపోయిన రోజుగాని, గంటగాని మరల తిరిగి రమ్మంటే రాదు. అందువలన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాలాన్ని దుర్వినియోగం చేస్తే భగవంతుని అగౌరవపరిచినట్లు భావించాలి. ఎందుచేతనంటే నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు గీతలో చెప్పాడు. జీవకోటి చనిపోయిన తరువాత వారికి పునర్జన్మ ఎలాంటిది వస్తుంది అని కఠోపనిషత్‌లో నిచికేతస్సుడు యమధర్మరాజును అడుగుతాడు. కర్మానుసారం జన్మవస్తుంది. మరల మానవ జన్మ రావాలని ఏమీలేదు. ఇప్పడు మానవుడిగా పుట్టినవాడు వచ్చే జన్మలో పశువుగా జన్మించవచ్చు లేకపోతే ఇంకా ఉన్నతమైన వ్యక్తిగా పుట్టవచ్చును. అంతకు ముందు జన్మలో కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకొన్నాడు, వాడు చేసిన కర్మ ఏమిటి దానిని బట్టి పునర్జన్మ నిర్ణయింపబడుతుంది. మానవజన్మ వచ్చిన తరువాత దానిని సద్వినియోగం చేసుకోకపోతే మీరు పశువుగాను, చెట్టుగాను పుట్టవచ్చు. కాలాన్ని సద్వినియోగం చేసుకొని వాడి చైతన్యస్థాయి పెంచుకొంటే మోక్షాన్ని పొందవచ్చు. మన చైతన్యస్థాయి ఎంతవరకు పెరిగింది అది చూసుకోవాలి కాని మన వయస్సు ఎంత అన్నది ముఖ్యంకాదు. మానవుడికి వయస్సు పెరుగుతోంది గాని లోపల చైతన్యస్థాయి పెరగటంలేదు. సమాజంలో ఇంత హింసాప్రవృత్తి ఉన్నదంటే మానవుడిలో చైతన్యస్థాయి తక్కువగా ఉండటమే కారణం. ప్రతిజన్మకు తల్లితండ్రులు, బంధువులు, స్నేహితులు ఉంటారుగాని అన్ని జన్మలలో ఒక మహాగురువు మనకు దొరకటం కష్టం. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశమును సద్వినియోగం చేసుకొంటే ఉత్తమజన్మవస్తుంది, భగవంతుడు మనలోపలే ఉన్నాడు కదా ఆయన మనకు మోక్షానికి దారిని చూపిస్తాడు.

దేవుని అనుగ్రహం వలన మనకు విచారణ చేయాలనే బుద్ధి కలుగుతుందా లేక విచారణ చేయటంవలన మనకు అనుగ్రహం కలుగుతుందా అని అడుగుతున్నారు. మోక్షసామ్రాజ్యానికి అధిపతి అవ్వటంకోసం ఆయన అనుగ్రహం ఎంతముఖ్యమో, మనకృషి కూడా అంతేముఖ్యం, ఒక్కమాటలో చెప్పాలంటే మనం చేస్తున్న కృషే ఈశ్వరానుగ్రహంగా మారిపోతుంది. మోక్షస్థితి పొందటానికే కాదు భౌతికంగా చిన్నపని నెరవేరాలన్నా మానవ ప్రయత్నం ఉండాలి, కాలం కలసిరావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. సాధన, ప్రయత్నం ఈ దేహానికి అక్కరలేదు, లోపల

ఉన్న చైతన్యానికి అక్కరలేదు. మరి సాధన ఎవరికి కావాలి అంటే లోపల ఉన్న జీవుడికి కావాలి. వాడు దేహముతో, మనస్సుతో, ఇంద్రియాలతో, బుద్ధితో తాదాప్యం పొందుతున్నాడు. ఆ జీవలక్షణాల నుండి విడుదల పొందటానికి సాధన అవసరం. ఎప్పుడైతే నీవు జీవలక్షణాల నుండి విడుదల పొందావో లోపల సహజంగా ఉన్న ఆనందం నీకు వ్యక్తమవుతుంది. లేనిది లేనట్లుగా నీకు తెలిసినప్పుడు, ఉన్నదేదో ఉన్నట్లుగా నీకు తెలుస్తుంది. నీ మనస్సులో ఉన్న బలహీనతలు, పునర్జన్మ కారణాలు నీవు తెలుసుకోవాలి. నీకు ఏ విషయాలు అయితే అశాంతిని కలుగజేస్తున్నాయెా వాటిలో నుండి విడుదల పొందటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన.ఎవడికైతే ప్రశాంతమైన మనస్సు ఉందో, ఎవడికైతే రజోగుణ వికారములు లేవో, ఎవడికైతే బ్రహ్మమును పొందాలనే కాంక్ష బలీయంగా ఉందో, ఎవడైతే తన మనస్సులో ఉన్న దోషముల నుండి విడుదల పొందటానికి ఇది రాత్రి, ఇది పగలు అనుకోకుండా నిరంతరము కృషి చేస్తున్నాడో అటువంటి యోగిని, అటువంటి సత్పురుషుని ఉత్తమసుఖం, ఉత్తమశాంతి తనంతట తానుగా వచ్చి వరిస్తుంది అని భగవంతుడు గీతలో చెప్పాడు. మనజీవితవిధానాన్ని చక్కగా తీర్చిదిద్దుకొంటే ప్రకృతి సుఖాలతో అంటులేని సుఖం ఉత్తమసుఖం వచ్చి మనల్ని వరిస్తుంది. దానికోసం నీవు ప్రయత్నం చేయనక్కరలేదు అదే వచ్చి నిన్ను వరిస్తుంది.

భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరిమీద అయిష్టం ఏమీ ఉండదు. నీవు చేసిన కర్మను బట్టి, నీ వాసనానుగుణంగా నీకు పునర్జన్మ నిర్ణయింపబడుతుంది. మనం ఏపనిమీద ఈభూమి మిదకు వచ్చామో అది మర్చిపోకూడదు. ఇతరుల మీద ఆధారపడకుండా నీదేహయాత్రకు సరిపడా పనులు చేసుకొంటూ మిగిలిన కాలాన్ని బ్రహ్మానుభవం పొందటానికి సద్వినియోగం చేసుకోవాలి. సాధ్యమైనంతవరకు చెడుతలంపులు రాకుండా చూసుకోవాలి ఎందుచేతనంటే తలంపును బట్టి మనం మాట్లాడతాము, తలంపును బట్టి పనిచేస్తాము. మంచి తలంపులు వస్తూ ఉంటే మనం ఉద్ధరించబడతాము, చెడుతలంపులు వస్తూ ఉంటే మనం అధోఃగతి పాలవుతాము. అందువలన తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీరు ప్రసంగాలు ఎందుకు చేయకూడదు అని భగవాన్‌ను అడిగారు. బోధ అంటే జ్ఞానాన్ని ఇవ్వాలి. ఏవాసనలో నుండి విడుదల పొందటానికి సాధకుడు ప్రయత్నం చేస్తున్నాడో ఆవాసనలో నుండి విడుదల పొందటానికి వాడికి శక్తిని ఇవ్వటం ముఖ్యం. అది మౌనం ద్వారా ఇవ్వవచ్చు. ప్రసంగాలు, అధ్యయనాలు ఇవి అన్నీ అవసరమే గాని ఇవి రెండో పక్షం. గురువు అనుగ్రహం మొదటి పక్షం. మనస్సు ఏనుగులాంటిది అది అణగాలంటే గురువు అనుగ్రహం అనే సింహం వలన అణగాలి గాని కేవలం నీతెలివితేటలు సరిపోవు. ఈశ్వరానుగ్రహం కావాలి అని అడుగుతున్నారు. నిన్ను నీవు అర్పించుకోవటవం వలన అది వస్తుంది. నీదైనందిన జీవితం అహంభావన లేకుండా జీవిస్తే అప్పడు ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. ఎటువంటి జ్ఞానం నీకు వస్తే ఆయన స్వరూపం నీకు తెలుస్తుందో అటువంటి జ్ఞానం ఆయన అనుగ్రహం వలన నీకు కలుగుతుంది. ఉన్నది అంతా అనుగ్రహమే. అనుగ్రహం విలువ మనకు తెలియటంలేదు. దాని విలువ మనకు తెలిస్తే దానిని సంపాదించటానికి ఏంతోకొంత ప్రయత్నంచేస్తాము.

శరణాగతే నిజమైన ప్రార్థన, శరణాగతి పొందటంవలన ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. ప్రతీచిన్న విషయానికి మనస్సును పుండుచేసుకొంటే నీవు శరణాగతి పొందలేవు. మీలో ఉన్న వాసనలతో పోరాడి జయించాలంటే ఎంతోకొంత మీకు శాంతికుదరాలి, శక్తి రావాలి. పునర్జన్మ రావటానికి ఒక చిన్న వాసనచాలు, అది నిన్ను సంసారచక్రంలో బంధిస్తుంది. వాసన ఎక్కడనుండి పుడుతోంది అంటే పూర్వజన్మలో ఏ విషయాన్ని అయితే భోగించావో, అక్కడ సుఖం లేకపోయినా సుఖం ఉందని భావించి ఏ విషయాన్ని అయితే భోగించావో ఆభోగంలో నుండి వాసన పుడుతుంది. మనకు సుఖం కావాలి కాని సుఖం ఎక్కడ ఉందో మనకు తెలియదు. అది ఎక్కడ ఉందో తెలియజెప్పటానికే గురువులు, మహాత్ములు ఈభూమి మీదకు వచ్చారు.

ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం కుదిరితే ఆవిశ్వాసమే మనకోసం ఒకరూపం ధరించి, వచ్చి మనలను తరింపచేస్తుంది. లోకం అనేది రకరకాలుగా ఉంటుంది. ఈప్రకృతి మనుషులను తప్పించుకొని గమ్యం చేరుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి. అమావశ్య చీకటి అనుకోండి అయినా మీచేతిలో టార్చిలైటు ఉంటే ఆ చీకటిలో కూడా మీరు నడచివెళ్ళటానికి అది సహకరిస్తుంది. ఇది కలియుగం, భక్తిభావన తక్కువ, తరించటం కష్టం ఈ గొడవలు మీకు ఎందుకు. ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం పెట్టుకొని మీరు సాధన చేస్తూ ఉంటే ఆయనే మిమ్మల్ని తరింపజేస్తాడు. మిగతా విషయాలు మీకు అనవసరము. దేశంలో నాయకులు ప్రజలకు సేవ చేస్తున్నారు కదా మరివారికి ఆత్మజ్ఞానం ఎందుకు కలగటం లేదు అని ప్రశ్న. వారు సేవచేయవచ్చు, మంచి పనులు చేయవచ్చు. అవి చేసేటప్పుడు ఏదో ప్రయోజనం ఆశించవచ్చు. ఆప్రయోజనం నెరవేరుతుంది గాని ఈశ్వరానుగ్రహంరాదు. వారు చేసే పని ఆఫలితానికే పరిమితం. ఫలితం అనుభవిస్తే పోతుంది. పరిమితులు లేకుండా కేవలము ఈశ్వరానుగ్రహం కోసమే కనుక పనిచేస్తే అప్పుడు ఈశ్వరానుగ్రహం వర్షిస్తుంది, వర్షించటమే కాదు నిన్ను జ్ఞానసామ్రాజ్యానికి అధిపతిని చేస్తుంది. నువ్వు ఒక వ్యక్తిని అనుకొన్నంతకాలం, నీకు జీవలక్షణాలు ఉన్నంతకాలం ఎవరో ఒక మహాగురువును గాని, ఒక దేవతాపురుషుడిని గాని ఆశ్రయించవలసిందే. పూర్వజన్మలో నీవు ఏదేవతాపురుషుడిని ఉపాసనచేసావో ఇప్పుడు నీ మనస్సు ఆయనవైపు ఆకర్షింపబడుతుంది. సత్వగుణం ఉన్నవాడికి ఏకాగ్రత అభివృద్ధి అవుతుంది. ఏకాగ్రత మీకు కుదిరితే అన్ని చదువులు వస్తాయి. మనహృదయంలో ఉన్నఏకాంత స్థితి మనకు దొరకాలి. మనహృదయంలో ఉన్న ఏకాంతవాసం మనకి దొరికితే ఈలోకంలో ఎంత అలజడి ఉన్నా మనంశాంతిగా ఉండవచ్చు.

భగవంతుడు వేరు, గురువు వేరు కాదు, గురువు అంటే నడుస్తున్న దైవం. భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా గురు రూపంలో వస్తాడు. గురువుగావచ్చి నీ మనస్సుకు పక్వత తీసుకొని వస్తాడు. మనస్సులో ఉన్న పుల్లదనాన్ని, చేదును బయటకు కక్కిస్తాడు. మీకు బాగా

పరిపక్వస్థితి వచ్చాక ఆ గురువే మీ హృదయంలో ఆత్మగా మీకు సిద్ధిస్తాడు. అప్పుడు దేహం ఉన్నా, లేకపోయినా ఒకటే, లోకం కనిపించినా, కనిపించకపోయినా ఒకటే అది పరమస్థితి. ప్రతీ దేశానికి ఏవిధంగా అయితే రాజ్యాంగం ఉందో అలాగ దేవునికి కూడా ఒక రాజ్యాంగం ఉంది. ఆరాజ్యాంగానికే ధర్మం అని పేరుపెట్టారు. అది ఏమిటి అంటే నువ్వు ఏమి చేస్తే అదే నీకు ఎదురు వచ్చేలా చేస్తాడు. దీని ననుసరించే జీవకోటిని నడిపిస్తాడు. అందుచేత లోక విషయాలలోనికి ఎక్కువగా వెళ్ళవద్దు. అలా వెళితే మీకు అహంభావన పెరుగుతుంది. భగవాన్ పునర్జన్మల గురించి చెప్పేవారుకాదు. నువ్వు చావులేని వస్తువు గురించి ప్రయత్నం చేస్తావా లేక పుట్టి చనిపోయే దేహాల గురించి ఆలోచిస్తావా అనేవారు. ఏదైనా వస్తువు మీకు ఇస్తే దానం చేసాను అనుకొంటాను. మీరు వేరు, నేను వేరు అని వేరుభావన ఉంది కాబట్టి అలా అనుకొంటున్నాను. కాని నాకుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొంటే నేను దానం చేసాను అనుకోను ఎందుచేతనంటే కుడిచేయి, ఎడమచేయి నాదేకాబట్టి. అలాగే జ్ఞానికి ఈసృష్టితో తాదాప్యం ఉంటుంది. ఆయన చూపుతో, మాటతో, పనితో ఈ భూమిని అనుగ్రహం అనే వర్షంతో తడుపుతాడు. మీ విమర్శలు, స్తోత్రాలు ఆయనకు అక్కరలేదు. భగవాన్ కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేవారుకాదు. మీప్రశ్నకు సమాధానం చెపితే అది మిమ్మల్ని ఎన్నివేల జన్మలకు తీసుకొని వెళుతుందో నాకు తెలుసు అందుచేత సమాధానం చెప్పను అనేవారు.

మీ మనస్సును ఏవిషయంలోను కంగారు పెట్టవద్దు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తున్నారు అనుకోండి ఆవిమర్శించే వారికంటే మీరు బుద్ధిమంతులు అని మీకు తెలిస్తే మీమనస్సుకు కంగారురాదు. మీమనస్సుకు ఉన్న హర్రీని, వర్రీని ఎప్పుడైతే తగ్గించుకొన్నారో అప్పుడు మీమనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది, ఆత్మను పొందుతావు. అప్పుడు లోకంలోని విషయాలు నిన్ను బాధించవు. అంతర్ముఖుడవు అవ్వు, లోపల ఉన్న ఆత్మను చూడు. అప్పుడు లోకంలో కష్టాలు, భాదలు నీకుకనిపిస్తే నాకు చెపుదువుగాని అనేవారు. శరీరం చనిపోయి నపుడు బంధువులతో, స్నేహితులతో సంబంధం తెగిపోతుంది గాని గురువుతో సంబంధం తెగదు. మనం ఎన్నిసార్లు జన్మించినా, మరణించినా, ఏప్రాంతంలో ఉన్నా ఆయన స్థితిని మనకు ప్రసాదించే వరకు గురువు మనలను వదలడు. మానవుడికి భోద ఎందుకు అంటే వాడిచైతన్య స్థాయిని పెంచటానికిగాని మూఢనమ్మకాలతో నింపటానికి కాదు. జ్ఞానం లేకుండా మోక్షం రాదు. ఆత్మజ్ఞానం యొక్క ప్రయోజనం ఆత్మను పొందింపజేయటమే. దైనందిన జీవితంలో అహంభావనను ఏరోజుకారోజు తగ్గించుకొంటూరావాలి. నీశరీరం పడిపోయేరోజు వచ్చేటప్పటికి అది పూర్తిగా రాలిపోవాలి. దేహబుద్ధి రాలిపోయిన మరుక్షణంలో నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది. అప్పుడు అంతటా నీవే ఉన్నావనే అనుభవం నీకు కలుగుతుంది. ఆత్మసాక్షాత్కారం పొందినవాడికి ఈచావుపుట్టుకలు బొమ్మలాటలు.